క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన నాయకులు



అద్దంకి: ఇటీవల రాష్ట్రస్థాయి కమిటీల్లో నియమితులైన స్టేట్ పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రటరీ కోయి అంకారావు, బూత్ కమిటీ వింగ్ జాయింట్ సెక్రటరీ పులికం కోటిరెడ్డి మంగళవారం వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. తమకు పదవులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బల్లికురవ: బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా బోటనీ సబ్జెక్టు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం మార్కులతో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేయాలన్నారు. ఈ నెల 28వ తేదీలోపు అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాను కళాశాలలో అందజేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకోవాలి



చీరాల అర్బన్: తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి విద్యార్థినులు విద్యలో రాణించాలని ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు అన్నారు. స్థానిక యార్లగడ్డ అన్నపూర్ణాంబ ప్రభుత్వ మహిళా కాలేజీలో మంగళవారం మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన యాప్‌లపై పోలీసులు, హెల్త్ కేర్ ఎన్‌జీఓతో కలిసి విద్యార్థినులకు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎస్.మురళి అధ్యక్షత వహించారు. ఒన్‌టౌన్ ఎస్సై జి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన యాప్‌లను గురించి వివరించారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం తదితర యాప్‌ల ద్వారా ఎటువంటి మోసాలు చేస్తున్నారో ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.నీలాకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నల్లబర్లీ కొనుగోలు కేంద్రం ప్రారంభం

మార్టూరు: మండలంలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ఈ వారంలో ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి రామినేని లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బొల్లాపల్లి, ఇసుక దర్శి గ్రామాల్లో గల ప్రభుత్వ గిడ్డంగుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. మండలంలో 677 మంది రైతులు నల్లబర్లీ పొగాకు విక్రయాల కోసం రిజిస్ట్రేషన్ ఇప్పటికే చేసుకున్నారని, వారిలో 40 మంది ఇప్పటికే విక్రయించుకున్నట్లు ఆమె తెలిపారు. పొగాకు కొనుగోలుకు సంబంధించిన నగదు 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని వినతి

బల్లికురవ: సచివాలయాల్లో పనిచేస్తున్న అన్ని శాఖల ఉద్యోగులకు పదోన్నతితో స్పష్టమైన జాబ్‌చార్టు, సర్వీసు రూల్స్‌తో బదిలీలు చేపట్టాలని సచివాలయ ఉద్యోగులు ప్లకార్డులతో తహసీల్దార్ మండల పరిషత్ కార్యాలయాల ముందు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని 20 సచివాలయాల్లో పనిచేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులంతా సొంత మండలాల్లోనే బదిలీలు జరపాలని, డిప్యూటీ తహసీల్దార్ రవి కుమార్, ఎంపీడీవో కార్యాలయం ఏవో పాండ రంగస్వామికి వినతి పత్రాలు అందజేశారు.

చినగంజాం వైద్యాధికారిగా సిరివెన్నెల

చినగంజాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారిగా సీహెచ్ సిరివెన్నెల మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్ బదిలీపై ఒంగోలు రిమ్స్‌కు వెళ్లగా ఆ స్థానంలో ఆమె చేరారు. పల్నాడు జిల్లా కొచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఆమె చినగంజాంకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన ఆమెను డాక్టర్ పీ సాయి శ్రీ చరణ్, ఆస్పత్రి సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

బైకును ఢీ కొట్టిన కారు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): బైకుపై రోడ్డు దాడుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టిన ఘటన మంగళవారం సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు మండలంలో ఏల్చూరు గ్రామానికి చెందిన వల్లెపు రవితేజ పని నిమిత్తం బైకు మీద గ్రామంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి నామ్ రహదారిని బైకుపై దాటుతుండగా నరసరావుపేట వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. దీంతో రవితేజకు గాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ విద్యార్థుల ఎంపిక

జే.పంగులూరు: ప్రభుత్వ విద్యార్థులు ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. మండల పరిధిలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం రఘురామయ్య మంగళవారం తెలిపారు. భవనం దివ్య నూజివీడు ట్రిపుల్ ఐటీ, జి మురళికృష్ణ సాయి, షేక్ షమీరా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ అలవల వీరారెడ్డి, గ్రామ పెద్దలు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, గాదె బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు ఎంపిక..

బల్లికురవ: మండల పరిధిలో కొప్పెరపాడు, కొమ్మినేనివారిపాలెం పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. కొప్పెరపాడు ఉన్నత పాఠశాల నుంచి కే నాగసాయి చరణ్‌తేజ, మాదాల హేమ స్రవంతి, కొమ్మినేనివారిపాలెం నుంచి షేక్ సుహానా ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్ఎం శ్రీనివాసరావు, బీ రామారావు, ఉపాధ్యాయులు తెలిపారు.

సంతమాగులూరు(అద్దంకి): సంతమాగులూరు మండలంలోని కుందుర్రు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన తోట జయలక్ష్మి, చవిటిపాలెంకు చెందిన కొర్రపాటి విజయరాణిలకు నూజివీడులో, మక్కెనవారిపాలెంకు చెందిన రాగనాగ అన్షిత, ఉమర్, ఖాదర్ మస్తాన్ శివాజీల కూడా ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. వీరిని ఎంఈవో ఎంఈవో కోటేశ్వరరావుతోపాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.



కేవీ పాలెంలో మిఠాయిలతో అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు



చీరాలలో ట్రిపుల్ విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

యద్దనపూడిలో

యద్దనపూడి: యద్దనపూడి హైస్కూల్‌లో గుంజి శ్రీనాథ్‌కు ఇడుపులపాయ, పూనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పల్లపు భార్గవికి ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీలో సీట్‌లు వచ్చినట్లు హెచ్ఎంలు ఎం దేవేంద్రరావు, శ్రీనివాసరావులు తెలిపారు. వీరురువురుని ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన లక్ష్మిశెట్టి భార్గవి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఉపాధ్యాయులు, గ్రామస్తులు తెలిపారు.

ఏడుగురు విద్యార్థినుల ఎంపిక..

చీరాల అర్బన్: మండలం ఈపూరుపాలెంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని హెచ్ఎం కె.హనోరా తెలిపారు. వూట్ల హిమబిందు, షేక్ సుమేర, ఇట్టే మేఘన, మునగపాటి మైథిలి, దాసరి తులసిలు నూజివీడుకు, వై.మానస, వూట్ల యశస్వినిలు ఒంగోలులోని ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారన్నారు.



భవనం దివ్య



మురళికృష్ణసాయి



షేక్ సమీరా



ఎస్‌కే సుహాన



తోట జయలక్ష్మి



కే విజయరాణి



రాగనాగ అన్షిత



ఉమర్



ఖాదర్ మస్తాన్



శివాజీ



గుంజి శ్రీనాథ్



పల్లపు భార్గవి



భార్గవి

పొగాకు కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారు ?



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మేరిమ్మ

ఇంకొల్లు(చినగంజాం):

మండల కేంద్రమైన ఇంకొల్లులో పొగాకు కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారంటూ ఎంపీటీసీ షేక్ అయేషా బుడే మండల వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. ఇంకొల్లు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ముందుగా వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, రెవెన్యూ, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, వెలుగు, అంగన్‌వాడీ, ఉపాధి హామీ పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయాధికారిణి ఎస్ మేరిమ్మ మాట్లాడుతూ ఇంకొల్లులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని రెండు మూడు రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన రకం పొగాకు ధర కిలో రూ.12 , తక్కువ రకం రూ కిలో రూ.6 చొప్పున కొనుగోలు చేస్తామని ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ తూమాటి చలమయ్య, ఎంపీటీసీ వై శిరోమణి, గుంజి తిరుపతమ్మ, ఎం రాజగోపాల్ రెడ్డి, రావి పేరయ్య కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కే సుభాని తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతో లాభాలు



పుల్లరిపాలెంలో మాట్లాడుతున్న ఏఓ సరిత



అద్దంకి: మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ

జే.పంగులూరు: రైతులు పొగాకు పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని ఏవో డీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. రైతులు పరిమితికి మించి వైట్, బ్లాక్ బర్లీ పొగాకు పండించిన రైతులు వాటిని అమ్ముకునేందుకు పడుతున్న కష్టాలను ప్రజలు గమనించుకోవాలన్నారు. ఈ ఏడాది పొగాకు కంపెనీల నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా సాగు చేయవద్దన్నారు. పొగాకు పంటకు బదులు జొన్నలు, మొక్కజొన్న, పప్పుధాన్యాల పంటలు సాగు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చింతల సహదేవుడు, గడ్డం నాగేశ్వరరావు, వీఏఏలు సిలాష్, అక్షరాని రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ: రైతులు పొగాకు పంట సాగుకు బదులు కంది, పత్తి, కొర్రలు సాగు చేయాలని ఏరువాక కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త మురళీధర్ నాయక్ వెల్లడించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొణిదెన, కే రాజుపాలెం గ్రామాల్లో రైతులుతో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగుతో మోతాదులో ఎరువులు వాడాలని, పంటలకు ఆశించే చీడపీడలు, నివారణ, సస్యరక్షణ చర్యలను ఆయన వివరించారు. కార్యక్రమాల్లో మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, ఏవో పీ శ్రీనివాసరావు, ఏఈవో మౌలాలి పాల్గొన్నారు.



కొండమజులూరులో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏఓ సుబ్బారెడ్డి

పొగాకు కంపెనీ మాటలు విని మోసపోవద్దు..

అద్దంకి: పొగాకు కంపెనీ మాటలు విని రైతులు మోసపోవద్దని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పొగాకు కెంపెనీలు మళ్లీ పొగాకు సాగు చేయాలని రైతులను ప్రోత్సహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ దృష్టికి వచ్చిందన్నారు. వారి మాటలు నమ్మి సాగు చేసి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని చెప్పారు. ఈ ఏడాది సంవత్సరం పొగాకును ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికార దీప్తి, రైతులు పాల్గొన్నారు.

రాయితీ పై పచ్చిరొట్ట విత్తనాలు

వేటపాలెం: రాయతీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నట్లు ఏవో సరిత తెలిపారు. మంగళవారం పుల్లరిపాలెం రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేసి అవి పూత దశలో ఉండగా నేలలో కలియదున్నడం వల్ల భూసారం పెంచుకోవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో మున్నంగి జస్వంత్, జ్యోతి, కుసుమ రైతులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి

ఇంకొల్లు(చినగంజాం):

రేషన్ డీలర్‌లు అందుబాటులో ఉండి రేషన్ సరుకులను సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మండలంలోని రేషన్ డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. రేషన్ డీలర్‌లు నిర్దేశించిన సమయాల్లో రేషన్ షాపులను తెరచి ఉంచి సరుకులను పంపిణీ చేయాలని, రేషన్ ధరల పట్టికను తప్పనిసరిగా ఉంచాలని, తూకం కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జులై నెల రేషన్ పంపిణీకి సంబంధించి 65 సంవత్సరాలు పైబడిన కార్డుదారులు, దివ్యాంగులకు జూన్ నెల 26 నుంచి 30 వరకు డీలర్‌ల ద్వారా రేషన్ కార్డుదారుని ఇంటి వద్దనే పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, డీలర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్‌లతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల సమస్యలు పరిష్కరించాలి

పర్చూరు(చినగంజాం): ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు మంగళవారం ఎంపీడీవో వీ ప్రద్యుమ్నకుమార్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి విధులు నిర్వహిస్తూ గ్రామస్థాయిలో పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, సర్వశిక్షాభియాన్, గృహనిర్మాణం, ఇంజినీరింగ్ పనులను క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. వీటితోపాటు ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలు, బీఎల్‌ఓ డ్యూటీలు ఏకకాలంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తమకు ఆరు సంవత్సరాల సర్వీసు కాలం ముగిసినా కూడా నేటికి ప్రభుత్వం తమకు తగిన ప్రమోషన్ చానల్ కల్పించలేదని విమర్శించారు. ప్రమోషనల్ చానల్ మార్గదర్శకాలు విడుదల చేసిన తరువాతనే బదిలీ ప్రక్రియ కొనసాగించాలని పేర్కొన్నారు. తమ సమస్య పరిష్కరించే వరకు దశలవారీగా నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు

ఏడాది పాలనలో ఎస్సీ,ఎస్టీ సంక్షేమానికి తూట్లు

చీరాల రూరల్: యోగా డేలు కాకుండా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ డేలు జరపాలని.. ఏడాది పాలనలోనే ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం తూట్లు పొడించిందని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్ర రావు విమర్శించారు. మంగళవారం చీరాలలోని దళిత మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్ర రావు పాల్గొని మాట్లాడారు. సామాజిక న్యాయానికి పాతరేసి వందల కోట్ల ప్రజాధనం యోగాంధ్ర పేరుతో ఖర్చు చేయడం కూటమి ప్రభుత్వ సనాతన ధర్మ పరిరక్షణ ప్రమోషన్‌లో భాగమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ముఖ్యమంత్రి అధ్యక్షతన ఆరు మాసాలకు ఒకసారి జరగాల్సిన ఎస్సీ, ఎస్టీ స్టేట్ లెవల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఒక్కసారి కూడా ఎందుకు జరపలేదని ప్రశ్నించారు. ఆయన హయాంలో ఆమోదించిన జస్టిస్ పున్నయ్య కమిషన్ జీవోలను అమలు చేయకుండా ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. ప్రతినెలా 30వ తేదీన మండల స్థాయిలో జరగాల్సిన సివిల్ రైట్స్‌డే రాష్ట్రంలో ఎక్కడా జరగడం లేదన్నారు.

మంత్రి ఇలాఖలోనే జరగని న్యాయం..

సాక్షాత్తు సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రకాశం జిల్లాలోనే ఏడాదిగా ప్రతిమూడు నెలలకు ఒకసారి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరగాల్సిన జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశం ఒక్కసారి కూడా జరగలేదన్నారు. గతంలో నక్సలైట్లతో ప్రభుత్వం జరిపిన చర్చల సందర్భంగా కోనేరు రంగారావు కమిటీ మేరకు దళితుల భూమి సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. దళితులకు సంభందించి ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.431 కోట్లు కేటాయించి ఇప్పటికి రూపాయి కూడా విడుదల చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. సమావేశంలో దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి అంజయ్య, కాకుమాను రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



106 పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జే.పంగులూరు: మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి కుమారి, తహసీల్దార్ పీ సింగారావు పరిశీలించారు. ముప్పరం పరిధిలోని 235, 236, 237 పోలింగ్ కేంద్రాలను, బూదవాడ గ్రామంలోని 217, 218, 219 కేంద్రాలను, కల్లంవారిపాలెంలోని 216, చందలూరు గ్రామంలోని 250, 251, 252 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1200 కంటె ఎక్కువగా ఉండే పోలింగ్ కేంద్రాల వద్ద మరో కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. చందలూరులోని 251 పోలింగ్ కేంద్రంలో పెచ్చులూడుతున్నాయని దానికి ప్రత్యామ్నాయం చూసి బిల్డింగ్ పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచనలు అందించారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్లు

బల్లికురవ: గ్రామ సమీపంలో స్వయంభూగా వెలసిన చట్టుపోలేరమ్మ తల్లి వార్షిక తిరుణాళ్ల మంగళవారం వైభవంగా నిర్వహించారు. గుంటుపల్లి గ్రామంతోపాటు, పరిసర గ్రామాల్లోని బక్తులు ఉదయం ఆరు గంటల నుంచే అమ్మవారి సన్నిధికి చేరారు. ఉపాలయాలైన ఆంజనేయ స్వామి, వీరభద్రస్వామి, రేణుకమ్మలను దర్శించుకుని పొంగళ్లు పెట్టి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన పెద్ది ఏడుకొండలు, తన కుమారుడు జస్విత్ ప్రణవ్ జన్మోత్సవ సందర్భంగా అమ్మవారికి రూ.లక్ష నగదును ఆలయ కమిటీకి అందజేశారు. వేడుకల్లో భాగంగా అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేశారు.



అలంకరణలో అమ్మవారు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు ఎంపీపీ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వీరాంజనేయలు పాల్గొని విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో వీరాంజనేయలు మాట్లాడుతూ దాతలు సహకారం అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నారు. నోట్ పుస్తకాలను నూకతోటి జ్యోతిర్మయి బాబు 61 మంది విద్యార్థులకు 200 నోట్‌పుస్తకాలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో వీరాంజనేయులు

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

చీరాల రూరల్: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులను అక్కున చేర్చుకుని వారికి మెరుగైన వైద్య సేవలందించాలని ఏపీ వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మోజెస్ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన సోమవారం చీరాల ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులకు వైద్య సేవలు ఏవిధంగా అందిస్తున్నారని ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. రోగులపట్ల కఠినంగా వ్యవహరించకుండా వారికి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్, వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

రోటరీ సహాయ గవర్నర్‌గా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

పర్చూరు(చినగంజాం): జిల్లా రోటరీ 3150 సహాయ గవర్నర్‌గా నాగబైరు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల కేరళలోని మున్నార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను కాబోయే గవర్నర్ ఎస్‌వీ రామప్రసాద్ ఎంపిక చేశారు. 2025–26 సంవత్సరానికి చీరాల, క్షీరపురి చీరాల, వేటపాలెం, పర్చూరు, ఇంకొల్లు, పంగులూరు ఆరు క్లబ్‌లకు సేవలందించేందుకు నియామకం నిర్వహించారు. గతంలో పర్చూరు రోటరీ అధ్యక్షుడిగా రెండు సంవత్సరాలు అందించిన అత్యుత్తమ సేవలను గుర్తించి పదవి అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పర్చూరు రోటరీ క్లబ్ కార్యవర్గం, సభ్యులు అభినందనలు తెలియజేశారు. జూలై 1 వ తేదీ నుంచి పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.